క్లుప్తంగా

నాగేంద్రునికి పూజలు



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో వెలసిన నాగేంద్రస్వామి పుట్ట 11వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 1500 మంది పాల్గొన్నారు. కోనేటిపురం నాగేంద్ర స్వామి భజన భక్త బృందం భక్తి గీతాలను ఆలపించారు. నిర్వాహకులు కూరాకు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీర్ల నాగరాజు, విజయలక్ష్మి దంపతులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వరి కోతలు ప్రారంభం



రేపల్లె రూరల్: మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రేపల్లెమండలంలో 10,500 హెక్టార్లలో ఈ ఏడాది వరి పంటను రైతులు సాగు చేశారు. కాల్వకు ఎగువ ప్రాంతాల భూముల్లో పంట కోతకు సిద్ధం అవ్వడంతో రైతులు కోతలకు శ్రీకారం చుట్టారు. కోతలకు ఎకరాకు రూ.3,000 వరకు కూలి చెల్లించుతున్నారు. వాతావరణ శాఖ వాయుగుండం హెచ్చరికలు జారీ చేయడంతో మిగిలిన ప్రాంతాల్లోని రైతులు పంట కోతలకు సిద్ధమవుతున్నారు.

వక్తృత్వ, క్విజ్ పోటీల్లో సూరేపల్లి విద్యార్థుల ప్రతిభ



సూరేపల్లి(భట్టిప్రోలు): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన వివిధ పోటీల్లో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆయా పోటీలలో ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా వక్తృత్వ పోటీలలో బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న శనగపల్లి నవ్య ప్రథమ స్థానం, క్విజ్ పోటీలలో బాలుర విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఆరేపల్లి బాల వేంకట శ్రీనివాస్, బాలికల విభాగంలో శనగపల్లి నవ్య ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం కె.శ్రీనివాసశర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

యూనియన్ నూతన కమిటీ సభ్యులకు అభినందన



రేపల్లె రూరల్: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రేపల్లె డిపో నూతన కమిటీ సభ్యులకు డిపో మేనేజర్ రాజశేఖర్ బాబు స్థానిక డిపో గ్యారేజ్‌లో శుక్రవారం అభినందనలు తెలిపారు. కమిటీ అధ్యక్షులు బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు శేఖర్, వీఎస్ఎస్ రావు, కార్యదర్శి డి.ఎస్.చిట్టిబాబు, కోశాధికారి వి.వి.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎల్‌వీ రావు, ఏ నవీన్, గౌరవాధ్యక్షుడు పి.కమలాకర రావుతో పాటు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రంగనాథ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి వారోత్సవాలు



చావలి(వేమూరు): బ్రిటిష్ వారి బానిస విధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్య సాహసాలను ప్రదర్శించిన మహనీయుడు బిర్సా ముండా అని మండల విద్యాశాఖాధికారి రోజ్లాండ్ అన్నారు. వేమూరు మండలంలోని చావలి మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బిర్సా ముండా జయంతి వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బిర్సా ముండా గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకునిగా బ్రిటిష్ వారిని గడ గడ లాడించిన ధీరుడు, భరతమాత ముద్దు బిడ్డ అని అన్నారు. ప్రతి ఏడాది నవంబర్ 22వ తేదీ నుంచి బిర్సా ముండా వారోత్సవాలు నిర్వహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యూలా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సేవలు

తెనాలి: పేద పిల్లలకు ఆర్థిక సాయం, స్కూలు పిల్లలకు బుక్స్, మెటీరియల్స్, బస్టాండు, రైల్వే స్టేషన్, మురికివాడల్లోని అనాధలకు భోజనం పంపిణీ లాంటి పలు సేవలను అందిస్తున్న బ్యూలా మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ఇండోర్ స్టేడియంకు గ్రహణం

- మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్న క్రీడాకారులు



పనులు నిలిచిపోవటంతో ఇండోర్ స్టేడియం ప్రస్తుత స్థితి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరి బాల్యం ఆటలతోనే ప్రారంభమవుతుంది. ఆటలు ఆడటం వల్ల మనిషి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటాడు. క్రీడల ఆవశ్యకతను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుత కుటమి ప్రభుత్వం ఆ కార్యక్రమాలను పూర్తిగా విస్మరిస్తోంది. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించింది. నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారులు తర్ఫీదు పొందేందుకు వీలుగా ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా 2023లో రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రూ.2 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రారంభించారు. పనులు తుది దశకు చేరుకునే నాటికి ఎన్నికల కోడ్ రావడం, తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో స్టేడియం నిర్మాణంకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇండోర్ స్టేడియం నిర్మాణంపై శ్రద్ధ చూపక పోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అప్పటికే 70 శాతం పూర్తయిన స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తే తీర ప్రాంతంలోని క్రీడాకారులు శిక్షణ పొందేందుకు చక్కని వేదిక ఏర్పడుతుంది. పాలకులు, అధికారులు స్పందించి స్టేడియం పనులపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇండోర్ స్టేడియంతో ఎన్నో ఉపయోగాలు

తీరంలో అనేక మంది క్రీడాకారులు తమ ఆటలను మెరుగుపరుచుకునేందుకు పట్టణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్టేడియంలో ఉండే వసతులతో తర్ఫీదు పొంది తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఏర్పడుతుంది. షటిల్ బ్యాడ్మింటన్, తైక్వాండో, చెస్, క్యారమ్స్ వంటి అనేక ఆటలకు తర్ఫీదు పొందటంతో పాటు పోటీల నిర్వహణకు చక్కని వేదికగా రూపుదిద్దుకుంటుంది. నేటి వరకు రేపల్లె నియోజకవర్గంలో క్రీడాకారులు తమ ఆటలను మెరుగుపరుచుకునేందుకు ప్రత్యేక ఆట స్థలం గానీ, స్టేడియంలు గానీ లేకపోవటంతో నిరాశ చెందుతున్నారు. స్టేడియంలు లేకపోవటంతో గతంలో కల్యాణ మండపాలు, మార్కెట్‌యార్డు ఆవరణలో పలు పోటీలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి.

అధ్వాన్నస్థితికి చేరుతున్న ఇండోర్ స్టేడియం

స్టేడియం నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవటంతో ఇండోర్ స్టేడియంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఆ వైపు వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ప్రాంతంలో పిచ్చి చెట్లు పెరిగి విష పురుగుల సంచరిస్తుండటంతో ఆ ప్రాంతంలో నడిచే వారే కాకుండా సమీపంలోని కళాశాలల విద్యార్థులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. పాలకులు స్పందించి స్టేడియం పనులు త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు కానుకగా అందించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక



అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు



ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్



కోశాధికారి యు.కుమార్

నిజాంపట్నం : యూటీఎఫ్ నిజాంపట్నం మండల శాఖ నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం నిజాంపట్నంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య సీహెచ్ బాపయ్య ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో మండల శాఖ అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ హెస్సేన్, గౌరవ అధ్యక్షులుగా సీహెచ్ గణేష్‌రావు, సహ అధ్యక్షులుగా ఓ నాగరాజు, సహ అధ్యక్షురాలిగా ఎన్.సుధారాణి, కోశాధికారిగా యు.కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన కమిటీని జిల్లా కౌన్సిలర్ హరిబాబు, మాలిక్, రాజేష్, మార్క్, మహేశ్వరరావు తదితరులు అభినందించారు.

స్వర్ణోత్సవ మహాసభ: అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ యూటీఎఫ్ లక్ష్యమని బాపట్ల జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నిజాంపట్నం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన స్వర్ణోత్సవ మహాసభలో వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ పాటు పడుతుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య మాట్లాడుతూ అప్రెంటీస్ రద్దు, రి గ్రూప్ స్కేల్ సాధించడంలో యూటీఎఫ్ చేసిన కృషిని కొనియాడారు.

ఎన్‌పీసీఐ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియకు సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు

రేపల్లె రూరల్: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆధార్ మ్యాపర్ క్యాంప్‌లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. పట్టణంలోని నేతాజీనగర్, కూరగాయల మార్కెట్, పీర్ల పంజా, 1వ వార్డు ఎస్టీ కాలనీలోని సచివాయంలో ఏర్పాటు చేసిన ఎన్‌పీసీఐ స్పెషల్ క్యాంప్‌లను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. నగదు బదిలీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు సంబంధించిన లబ్ధిని పొందాలంటే ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ తప్పనిసరి అని చెప్పారు. పోస్టల్ శాఖ ద్వారా కేవలం రూ.200తో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో నరేంద్ర, పోస్ట్‌మాస్టర్లు, ఏబీపీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన



పూజ కార్యక్రమాల్లో భక్తులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (రథం గుడి) దేవస్థాన వంశ పారంపర్య ట్రస్టీ కొడాలి శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాచాబత్తుని వంశీయులచే లక్ష బిల్వార్చన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి మారేడు దళాలతో లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచాబత్తుని వంశీయులైన ఓం ప్రకాష్–నాగజ్యోతి, శివనాగరాజు–మాలతి, రుద్ర పశుపతిరావు–కనకదుర్గ, ధనప్రసాద్–దివ్య, చిరంజీవి–లీలాభవాని, షణ్ముఖశంకర్–సుప్రియ దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వామి వారికి ప్రభాత సంకీర్తన, మారేడు దళాలకు భజన సమాజం ఆధ్వర్యంలో సంకీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి జ్యోతిర్లింగార్చన, అఖండజ్యోతి దీపారాధన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచన కార్యక్రమాలు జరిపారు.

నిర్మల్ హృదయ్‌లోకి మతిస్థిమితం లేని వృద్ధురాలు



నిర్మల్ హృదయ్ ప్రతినిధులతో అధికారులు

తెనాలి: మతిస్థిమితం లేకుండా ఒంటరిగా సంచరిస్తున్న అంజమ్మ అనే వృద్ధురాలిని గుంటూరులోని నిర్మల్ హృదయ్ (మిషనరీస్ ఆఫ్ ఛారిటీ) అక్కున చేర్చుకుంది. శుక్రవారం రాత్రి తెనాలి వచ్చిన నిర్మల్ హృదయ్ ప్రతినిధులకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు అంజమ్మను అప్పగించారు. వృద్ధురాలిని తమ సంరక్షణలో ఉంచుకుని తగిన వైద్యం, ఆహారం అందిస్తామని చెప్పారు. తమతో గుంటూరుకు తీసుకెళ్లారు. పట్టణ చినరావూరుకు చెందినట్టుగా భావిస్తున్న అంజమ్మ అనే వృద్ధురాలిని మూడురోజుల క్రితం ఎవరో తీసుకొచ్చి, స్థానిక మార్కెట్ వంతెన సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద వదిలేశారు. తన పేరు అంజమ్మగా చెప్పటం మినహా మరే వివరాలనూ చెప్పలేకపోతోంది. సమాచారం తెలిసిన హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధి ఇనయ్‌తుల్లా, మిత్రబృందం ఆమెకు దుస్తులు, ఆహారం ఇస్తూ వచ్చారు. ఆమె దీనస్థితిని గమనించిన కొందరు అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు నిర్మల్ హృదయ్‌ను సంప్రదించారు. దీంతో వారు ఇక్కడకు వచ్చారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కేహెచ్ నిర్మల, మెప్మా సీఎంఎం విజయ కుమారి ప్రభృతులు ఆ వృద్ధురాలిని నిర్మల్ హృదయ్ ప్రతినిధులకు అప్పగించారు.

24న హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ వేడుకలు

తెనాలి: హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ -ఏపీ ఐసీ-03 జోన్ ఆధ్వర్యంలో, ఈనెల 24న రూరల్ మండలగ్రామం కొలకలూరులోని ఆశ్రమంలో జరగనున్న వేడుకల్లో అభ్యాసులంతా పాల్గొనాలని ఆ సంస్థ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్.రామకోటేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 1945లో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థను స్థాపించిన పూజ్యశ్రీ బాబూజీ మహరాజ్ (షాజహాన్ పూర్, యూపీకి చెందిన శ్రీ రామచంద్ర) 125వ జయంతిని పురస్కరించుకుని ఈ సంవత్సరం పొడవునా ప్రపంచవ్యాప్త అభ్యాసులు వారి వారి ఆశ్రమాల్లో వేడుకలు జరుపుతున్నట్టు తెలియజేశారు. ఇదే సందర్భంగా ఈ జోన్ పరిధిలోని అభ్యాసులందరూ 24న కొలకలూరు జోనల్ ఆశ్రమంలో రోజంతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన వాతావరణంలో అభ్యాసులందరూ ధ్యానించి, సంస్థకు చెందిన మాస్టర్, మిషన్, మెథడ్ విశేషాలపై మరింత అవగాహనను పెంచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

వేమూరు: వేమూరు సబ్ స్టేషన్ 11 కేవీ పరిధిలోని ఫీడర్‌లో శనివారం వేమూరు గ్రామంలోని, జంపని రోడ్డు ప్రాంతంలో మరమ్మతుల పనులు చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

వేమూరు: వేమూరు గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సిబ్బంది వేమూరు గ్రామంలో బెల్టు షాపు నిర్వాహకుని వద్ద గురువారం రాత్రి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

ఓట్ల నమోదుకు ప్రత్యేక క్యాంపు

చుండూరు(వేమూరు): ఓట్లు నమోదు కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ లైవల్ అధికారులు పోలింగ్ బూతుల వద్ద ఓట్లు నమోదు చేయాలని, అభ్యంతరాల దరఖాస్తులు వస్తే వాటిని కూడా తీసుకోవాలని ఆయన సూచించారు.

28న ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రతాలు



బాపట్లటౌన్: పట్టణంలోని టౌన్‌హాల్‌లోని కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో కార్తిక మాసం పురస్కరించుకొని ఈ నెల 28న ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. ఈ వ్రతములు భావపురి భక్త బృందం, శ్రీలలితాత్రిపుర సుందరీపీఠం, విఖనస ఆర్ష ధర్మపీఠం మచిలీపట్నం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. వ్రతా లు బందరుకు చెందిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, దృక్ సిద్ధాంత పంచాగకర్త, ఉపన్యాస వాచస్పతి పండితులు ముత్తేవి శ్రీనివాస శశికాంత్ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. పాల్గొనే వారు నిర్ణీత సమయంలో టోకెన్ తీసుకొని సంప్రదాయ దుస్తులలో మాత్రమే ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. కలశంచెంబు,రెండు కొబ్బరికాయలు,జాకెట్ ముక్క, విడిపూలు, పంచపాత్ర,ఉద్ధరిణె తెచ్చుకొనవలెను.

ఘనంగా మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (రథం గుడి) దేవస్థాన వంశ పారంపర్య ట్రస్టీ కొడాలి శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాచాబత్తుని వంశీయులచే లక్ష బిల్వార్చన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి మారేడు దళాలతో లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచాబత్తుని వంశీయులైన ఓం ప్రకాష్–నాగజ్యోతి, శివనాగరాజు–మాలతి, రుద్ర పశుపతిరావు–కనకదుర్గ, ధనప్రసాద్–దివ్య, చిరంజీవి–లీలాభవాని, షణ్ముఖశంకర్–సుప్రియ దంపతులు పాల్గొన్నారు.

నేడు హేమ వితలేశ్వరునికి లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన బాలాత్రిపుర సుందరీ సమేత హేమ వితలేశ్వరస్వామి దేవాలయంలో శనివారం 41వ లక్ష బిల్వార్చన జరుగుతుందని సేవా సమాజం, భక్తులు శుక్రవారం తెలిపారు. ధర్మకర్తల సహకారంతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, అఖండ జ్యోతి దీప ప్రదర్శన, జ్యోతిర్లింగార్చన, మంత్రపుష్పం, సంకీర్తనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి



చందోలు(కర్లపాలెం): కిశోర బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి చెప్పారు. చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో కొన్ని చోట్ల మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చూస్తున్నామని బాలికలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలను బాలికలు ధైర్యంగా ఎదిరించాలని చక్కగా చదుకోవాలని తెలిపారు. లీగల్ అడ్వైజర్ మానిక మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైందని అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించటంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీప్రియ, సీడబ్ల్యూ సుకన్యకుమారి, మహిళా పోలీసులు శివమ్మ, లక్ష్మి, శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు



ధాన్యం కొనుగోలు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో మీరయ్య

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ పరిధిలోని అద్దేపల్లి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. గ్రేడ్ ఎ రకం 75 కిలోలు రూ.1,740, సాధారణ రకం రూ.1,725గా ప్రభుత్వం ధరను నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని తేమ 17 శాతం ఉండేలా ఆరబెట్టుకుని నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కోరారు. రైతులు ధాన్యం కేంద్రంకు వేసిన దగ్గర నుంచి 48 గంటలలోపు నగదు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కేంద్రాలలోనే అమ్మాలనే నిబంధన లేదని కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర బయట లభిస్తే విక్రయించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

26న బాపట్ల డివిజన్ స్థాయి క్విజ్ పోటీలు



నిజాంపట్నం: రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకుని ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం నిజాంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకుని నిజాంపట్నం మండలం చింకపాలెం జెడ్పీ హైస్కూల్లో బాపట్ల డివిజన్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలు మధ్యాహ్నం 1 గంటకు జరుగుతాయని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రో కబడ్డీ అంశాలపై నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9493442748, 9989508915 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మరుగుదొడ్లనే వినియోగించాలి



మరుగుదొడ్ల అవగాహన ర్యాలీలో ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ఆరు బయట మలవిసర్జన చేయవద్దని మరుగుదొడ్లనే వినియోగించాలని కర్లపాలెం మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పంచాయతీ ఎంవీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మరుగుదొడ్ల ఆవశ్యకతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరు బయట మలవిసర్జన చేయటం వలన అంటువ్యాధులు ప్రబలతాయని తెలిపారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. పరిశుభ్రంగా ఉండే వారు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, హెచ్‌ఎం జయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, పంచాయతీ కార్యదర్శి సునీత, వీఆర్వో అమానుల్లా ఖాన్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షాలతో రైతుల్లో అలజడి



భట్టిప్రోలులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట (ఇన్‌సెట్) వ్యవసాయ శాఖాధికారి జి. మీరయ్య

- నవంబర్, డిసెంబర్ నెలలు అంటేనే వణుకు
- వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళనలో రైతులు
- వణికిస్తున్న తుపాన్లు, వాయు గుండాలు

భట్టిప్రోలు: సేద్యం చేస్తున్న అన్నదాతకు నవంబర్, డిసెంబర్ నెలలు అంటేనే వణుకు పుడుతుంది. పంట ఇంటికి చేరే దశలో రైతులు ఎంతో ఆశతో ఎదురు చూసే తరుణంలో ఏటా ఈ 2 నెలల్లో తుపాన్లు, భారీ వర్షాలు సంభవించి చేతికి వచ్చిన పంట తడిసిపోవడంతో ఆవేదనతో రైతులు అల్లాడిపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట కొరగాకుండా పోవడంతో రైతు గుండె చెరువవుతోంది. దీంతో కౌలు రైతులు పంటలు సాగు చేయడానికి ముందుకు రావడంలేదు. ఫెంగల్ తుఫాన్ బంగాళాఖాతం ఆగ్నేయ ప్రాంతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఆరుగాలం కష్టించి చెమటోడ్చి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో అనూహ్యంగా వాయుగుండం ప్రభావంతో కురిసే వర్షాలు తమ పాలిట శాపంగా పరిణమించాయని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య శుక్రవారం రైతులకు సూచించారు. వరి కోతలు కోయని వారు వాతావరణ పరిస్థితులను బట్టి కోతలను నిలుపుదల చేయాలని తెలిపారు. వాయుగుండం ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించిందని చెప్పారు. ఇప్పటికే సాధ్యమైనంత వరకు హార్వెస్టర్ ద్వారా ధాన్యాన్ని సేకరించిన వారు సురక్షిత ప్రదేశంలో పట్టాలు కప్పి భద్రపరచుకోవాలని సూచించారు. కోతకు ముందు వర్షాలు పడితే వరి వెన్నులపై 5 శాతం ఉప్పు నీరు (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి) పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పైరు పనల మీద తడిస్తే ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి ఆరబెట్టాలని తెలిపారు.